క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

బిక్కవోలు: బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ గురువారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న అధ్యాపకుడు డాక్టర్ రవికుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవాశిబిరంలో భాగంగా గురువారం తొర్రేడు సొసైటీ సమావేశ మందిరంలో పెరటి తోటల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవికుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం వివిధ రకాల కూరగాయల విత్తనాల కిట్లను అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్, తొర్రేడు సొసైటీ అధ్యక్షుడు చిట్టూరి వెంకటరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణలు చేతుల మీదుగా అందించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వ్యవసాయ ప్రదర్శనలు, శాస్త్రవేత్తలు – రైతుల ఇష్టాగోష్టి, ఎన్ఎస్ఎస్ సేవాపథకం ముగింపు కార్యక్రమం జరుగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.హైమజ్యోతి తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక బంగాళాపేటలో డ్రైనేజీ నిర్మాణానికి గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు ఎంపీపీ నిధులతో ఈ డ్రైన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి మురుగు సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, తోలేటి రాంప్రసాద్, వార్డు సభ్యురాలు మచ్చా జయమ్మ, బిజ్జి రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగ కేశవరావు

మధురపూడి: శ్రీరామ నవమి సందర్భంగా కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగకేశవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా బాబాకు 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కంటే సత్యచక్ర గణపతి, మూతిన శివ మోహన్, విశ్రాంత వీఆర్వో ఏవీఎస్ఎన్ మూర్తి, మాజీ సర్పంచ్ బుద్ధిగ వీర వెంకట సత్యనారాయణ, సబ్బిన పెద్ద పాల్గొన్నారు.

ప్రాచీన కళలను ఆదరించాలి



కళాకారులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

రంగంపేట: హరికథ, శాస్త్రీయ నృత్యాలు తదితర ప్రాచీన కళలను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దార్ల అమ్మిరాజు అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట పాతూరులో కొలువై ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారులు ఎం.పూర్ణ బృందం, స్థానిక నృత్య బృందం ప్రదర్శించిన పోలేరమ్మ వేషధారణ అందరినీ అలరించింది. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ముళ్లపూడి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



రాజానగరం రావులచెరువు గట్టున ఉన్న కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం



బూరుగుపూడి రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం



శ్రీరామనగరం రామాలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



పందలపాక వెలంపేట రామాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సీతారాములు



రామవరంలో భక్తులకు పానకం పంపిణీ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- కిటకిటలాడిన రామాలయాలు

అనపర్తి: శ్రీరామనవమి.. నవమి రోజున శ్రీరామచంద్రమూర్తి పట్టు వస్త్రాలు ధరించారు.. పెళ్లి పీటలెక్కారు.. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల రామనామ స్మరణ.. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ జగదభిరాముడు సీతమ్మను మనువాడాడు. జీలకర్ర బెల్లం అమ్మ తలపై పెట్టాడు. తాళిబొట్టు కట్టాడు. మెడలో కల్యాణ మాల వేశాడు. ముత్యాల తలంబ్రాలు చల్లుకుని మురిసిపోయాడు. ఈ పెళ్లి తంతు కొనసాగుతున్నంతసేపు భక్తులు ఆ ఆదర్శ దంపతులను తలుచుకుంటూ పరవశించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రుల కల్యాణ వేడుకను గురువారం వాడవాడలా భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.

మండలంలోని అనపర్తి పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రామాలయం, జీబీఆర్ కళాశాల వద్ద గల ఆంజనేయస్వామి ఆలయం, పల్లీల రామాలయం, కొప్పవరం వెలమపేట, పాలమూరు గ్రంథాలయం వద్ద ఉన్న లక్ష్మణ, హనుమత్, సీతా సమేత కోదండ రామచంద్రస్వామి, రామవరం పడమట వీధిలోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో విశేష పూజల అనంతరం పండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణ క్రతువును జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సీతారాముల కల్యాణం సందర్భంగా రామవరం పడమట వీధిలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తనయుడు దివంగత సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ఆధ్వర్యంలో భక్తులకు బెల్లం పానకం పంపిణీ చేశారు.

పెదపూడి: జి.మామిడాడ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామి వారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా దంపతులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. వారికి ఆలయ ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు వెంట ఎంపీపీ కేతా తులసి, గ్రామ సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైస్ ఎంపీపీ పద్మ తదితరులు పాల్గొన్నారు. పీఈటీ ద్వారంపూడి యువరాజారెడ్డి శ్రీరామ నామాలు రాసిన బియ్యం గింజలను కలెక్టర్లు కృతికాశుక్లా, హిమాన్షు శుక్లా దంపతులు, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు చేతుల మీదుగా సమర్పించగా వాటిని కల్యాణంలో వినియోగించారు. కోనేరు వద్ద భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. పలువురు చలివేంద్రాలు ఏర్పాటు చేసి చిన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు, మజ్జిగ, తాగునీరు, పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు.

బిక్కవోలు: బలభద్రపురం రామాలయంలో స్వామి అమ్మవార్లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. పందలపాక, కొంకుదురు, బలభద్రపురం, ఆరికరేవుల రామాలయాలను జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి దంపతులు దర్శించుకున్నారు. కొమరిపాలెంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి దంపతులు సీతారాములకు పూజలు చేశారు.

రంగంపేట: రామాలయాల వద్ద గురువారం శ్రీరామనవమి కళ్యాణ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేట కచేరీ చావిడి వద్ద ఉన్న కోదండ రామాలయం వద్ద కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదానం చేశారు. రామాలయాల వద్ద కల్యాణం సందర్భంగా చలిమిడి, వడపప్పు, బెల్లపు పానకం, పులిహోర ప్రసాదంగా అందించారు. సీతారాముల ఆదర్శం అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని వేద పండితులు ఆశీర్వదించారు.



రామనామ తలంబ్రాలను అర్చకులకు అందిస్తున్న కలెక్టర్లు కృతికాశుక్లా, హిమాన్షు శుక్లా దంపతులు, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు



జి.మామిడాడలో ముత్యాల తలంబ్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకుడు



గోకవరం దాసరి వారి రామాలయంలో కల్యాణం చేస్తున్న జెడ్పీటీసీ శ్రీరంగ, రమేష్ దంపతులు

అంగరంగ వైభవంగా..

రాజానగరం: నియోజకవర్గంలోని రాములోరి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద సీతారాముల కల్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా జరిపించారు. రాజానగరం రావులచెరువు గట్టున కొలువు తీరిన కోదండ రాముని ఆలయం, అగ్రహారంలోని రామాలయం, ఎస్‌బీఐ రోడ్డులోని కంచుపట్ల రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులను వడపప్పు, పానకాన్ని ప్రసాదంగా పంచారు. కానవరంలోని కోదండ రాముని ఆలయంతో పాటు తోకాడ, ముక్కినాడ, మల్లంపూడి, రాధేయపాలెం, పాత, కొత్తతుంగపాడు, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, యర్రంపాలెం, సంపత్ నగరం, కొండగుంటూరు, దివాన్‌చెరువు, పాలచర్ల, వెలుగుబంద, సీతారామపురం, నందరాడ, నరేంద్రపురం, తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద శ్రీరామనవమి వేడుకలు కన్నులపండువగా సాగాయి. ఈ సందర్భంగా రాజానగరం రావుల చెరువు గట్టు రామాలయంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: శ్రీరామనవమి పర్వదినాన్ని గురువారం కోరుకొండ మండలంలో ఘనంగా నిర్వహించారు. దోసకాయలపల్లి, బూరుగుపూడి, కోరుకొండ, శ్రీరంగపట్నం, గాదరాడ తదితర గ్రామాల్లోని రామాలయాలకు భక్తులు తరలివెళ్లారు. బూరుగుపూడి రామాలయం వద్ద జరిగిన వేడుకల్లో పిచ్చికల వీర్రాఘవులు, గంగాభవాని దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం నిర్వహించారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరం రామాలయం, సీతానగరం లంకూరు దక్షిణ రామాలయం, వెలమపేట రామాలయంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిగింది. అనంతరం అన్నసమారాధన చేశారు. రఘుదేవపురం, పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, చినకొండేపూడి, నాగంపల్లి, చీపురపల్లి, కూనవరం, ముగ్గళ్ల, ఇనగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

గోకవరం: నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. స్థానిక దాసరివారి రామాలయంలో జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, ఎంపీపీ దంపతులు సుంకర శ్రీవల్లి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. వెలమపేటలోని గీతామందిరంలో సనాతనధర్మ ప్రబోధన సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి గ్రామంలో శ్రీరామగిరి కొండపై వేంచేసిన సీతారాముల ఆలయం, తంటికొండ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోనూ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన నవరత్నాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



అనపర్తి ధరణికోటలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం అనపర్తి గ్రామ సచివాలయం-4 పరిధిలో, ధరణి కోట గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కలుసుకుని వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలతో తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి అన్ని సందర్భాల్లో ప్రజలే అండగా ఉండాలని కోరారు. గడపగడపకూ కార్యక్రమం ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం

ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికై ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సంక్షేమ క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి దానికి అనుగుణంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, కర్రి చినవెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రి ధర్మారెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, వార్డు సభ్యుడు మల్లిడి కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, చిర్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంటికొండ దేవస్థానం చైర్మన్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఈఓకు అందజేస్తున్న రాంబాబు (రెడ్డి)

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పదవికి బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి) రాజీనామా చేశారు. ఇటీవల ఆలయంలో పలువురు సిబ్బంది హుండీల్లో భక్తులు వేసిన కానుకల విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వీటిపై విచారణ నిర్వహించే వరకూ హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించకూడదని కొద్దిరోజుల క్రితం హుండీ లెక్కింపును సైతం అడ్డుకున్నారు. దీనిపై ఎటువంటి విచారణ నిర్వహించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఈఓ ఆర్‌వీ చందనకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానం చైర్మన్ హోదాలో ఆయన సిబ్బంది విధులకు తరచూ ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఆయన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. ఆయన రాజీనామా పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.

తంటికొండ వెంకన్నకు రూ.8.34 లక్షల ఆదాయం



తంటికొండ వెంకన్న హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ వేంటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. ఆలయంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని, దీనిపై విచారణ నిర్వహించిన తరువాతే హుండీ ఆదాయం లెక్కించాలని కొద్దిరోజుల క్రితం హుండీ లెక్కింపును దేవస్థానం చైర్మన్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో గురువారం దేవదాయశాఖ తనిఖీ అధికారుల పర్యవేక్షణలో భక్తులు, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. మొత్తం ఆరు నెలల కాలానికి హుండీల ద్వారా రూ.8,03,313 ఆదాయం వచ్చింది. గతంలో ఆలయ ప్రాంగణంలో శీలు వేసిన పరకామణి హుండీ లెక్కించగా రూ.31,362 ఆదాయం వచ్చింది. మొత్తం హుండీల ద్వారా రూ.8,34,675 ఆదాయం వచ్చిందని, గతంతో పోల్చితే ఆదాయం పెరిగిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు నాగసురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిక్కవోలు: మండలంలోని కాపవరం పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ బుజ్జిదొర గురువారం తెలిపారు.

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, ఈలకొలను, జి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. రాజానగరం 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో వార్షిక మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా మధ్యాహ్నం 1 గంట నుంచి త్రీఫేజ్ సప్లయి ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నట్టు రంగంపేట ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు చెప్పారు.

ఊలపల్లిలో రూ.5 లక్షలు చోరీ

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో రూ.5 లక్షలు చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. బిక్కవోలు పోలీస్‌స్టేషన్ రైటర్ వీఎస్ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఊలపల్లి గ్రామానికి చెందిన మల్లంపూడి వీర వెంకట సత్యనారాయణరెడ్డి తన తల్లి అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు గోడ బీరువాలో భద్రపరిచాడు. బుధవారం రాత్రి ఆయన ఇంటిలో నిద్రలో ఉండగానే గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఉదయం లేచి బీరువా చూడగా నగదు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు శివకృష్ణ తెలిపారు.

రామచంద్రపురంలో ర్యాలీ

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురంలో గురువారం స్థానికులతో కలిసి హిందూ పరిషత్ సభ్యులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఇతర మండలం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రామచంద్రపురంలోని ఊరమెట్ట(కొండ)పై మేరీమాత విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. దీంతో ఆ మెట్ట చుట్టూ పొలాలు ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు ఈ విషయాన్ని స్థానిక వీఆర్వో దృష్టిలో ఉంచామని, మేరీమాత విగ్రహం తొలగించాలని, లేని పక్షంలో అక్కడ ఆలయం నిర్మిస్తామన్నారు.

రామనామమే రక్షణ కవచం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- వైభవంగా శ్రీరామ శోభాయాత్ర బైక్ ర్యాలీ



సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ: రామనామమే మానవాళికి రక్షణ కవచమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలో గురువారం జరిగిన శ్రీరామ శోభాయాత్ర బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. పుష్కరఘాట్ నుంచి ఆర్యాపురం, నందం గనిరాజు జంక్షన్, గోరక్షణపేట, ఏవీఏ రోడ్డు, పాత సోమాలమ్మ ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేడియం రోడ్డు మీదుగా సుమారు పది కిలోమీటర్ల మేర యాత్ర జరిగి, మళ్లీ పుష్కరఘాట్‌కు చేరుకుంది. అందరిలోనూ సోదరభావం వెల్లివిరియాలని, భారతీయ సంప్రదాయాలు, కట్టుబాట్లు అందరికీ తెలిసేలా హిందూ ధర్మం పరిఢవిల్లేలా శోభాయమానంగా ఈ యాత్ర జరుగుతుందని శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ ప్రవచించారు. పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ప్రతి పురుషుడూ రామచంద్ర ప్రభువుకున్న సుగుణాలను అలవర్చుకోవాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, ధర్మాన్ని కాపాడటం ఉత్తమ పురుషుల లక్షణమన్నారు. రాముడు జన్మించిన అయోధ్యలో ఆలయ పునర్నిర్మాణం అత్యంత అద్భుతంగా జరుగుతోందన్నారు. అంతకు ముందు రథంపై ఉన్న సీతారాముల మూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండేపూడి సురేష్, బండ్ల శంకర్, కామవరపు శ్రీరామ్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, రామ్‌సాయి దీపు పాల్గొన్నారు.

110 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులు

రాజానగరం: జాతీయ రహదారిపై స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద 110 కిలోల గంజాయి పట్టుబడింది. స్థానిక పోలీసులు రహదారిపై గురువారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా లారీ క్యాబిన్‌పై బస్తాలను గుర్తించారు. అనుమానంతో వాటిని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నర్సీపట్నం నుంచి తమిళనాడుకు ఈ దీనిని తరలిస్తున్న ఉండి మండలం యండగాడి గ్రామానికి చెందిన దండు సాయిరాజ్, నర్సీపట్నం సమీపంలోని బుచ్చింపేటకు చెందిన శెట్టి సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసును రాజానగరం ఎస్సై జుబేర్ దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సేవకు సహృదయ ఫౌండేషన్

రాజమహేంద్రవరం సిటీ: పేదలకు సాయం చేయాలన్న లక్ష్యంతో సహృదయ ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర నాయకుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఫౌండేషన్ ప్రారంభం సందర్భంగా గురువారం సీటీఆర్ఐ రోడ్డు భాస్కర నగర్ బాల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మరుకుర్తి రవి యాదవ్, గోవింద రాజు, కోటిబాబు, గుదే రఘు నరేష్ పాల్గొన్నారు.

నూరు శాతం లక్ష్యం సాధించాం

బిక్కవోలు: మండలంలోని ఉపాధి హామీ పనుల్లో నూరు శాతం లక్ష్యం చేరుకున్నట్లు ఉపాధి హామీ ఏపీవో జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో కూలీలకు 3,50,320 పని దినాలు కల్పించడం లక్ష్యం కాగా 3,51,642 పని దినాలు కల్పించామన్నారు.

కొట్లాటపై కేసు

మధురపూడి: కోరుకొండలో జరిగిన కొట్లాటకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. హోటల్ యజమాని పితాని నరసింహకు, అదే హోటల్లో పనిచేస్తున్న వర్కర్ మహంకాళి రాజేష్‌కు మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో రాజేష్ కత్తితో దాడి చేయడంతో నరసింహకు పొట్టపై గాయాలయ్యాయి. కాగా హోటల్ యజమాని బంధువులు రాజేష్‌పై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చారు. దీంతో ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు.

5న వాహనాలకు వేలం

మధురపూడి: కోరుకొండ సెబ్ స్టేషన్‌లోని 30 వాహనాలకు ఏప్రిల్ 5వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 28 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు వేలం నిర్వహిస్తామన్నారు.